క్లుప్తంగా

కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ గురువారం స్థానిక జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన స్థల వివాదం కేసులో బెయిల్ షరతుల మేరకు ఆయన సంతకం చేసేందుకు కోర్టుకు వచ్చారు. అనంతరం కోర్టు నుంచి బయటకు వచ్చిన ఆయనను నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మర్యాద పూర్వంగా కలిశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఆయన అండగా ఉంటానని భరోసానిచ్చారు.

చేపల చెరువుల ద్వారా రూ.38.10 లక్షల ఆదాయం




నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న చెరువుల్లో చేపలను పెంచుకునేందుకు గురువారం బహిరంగ వేలంను అధికారులు నిర్వహించారు. మూడు సంవత్సరాలకు గాను బూరుగుల చెరువులో చేపలు పెంచుకునేందుకు ఏలూరుకు చెందిన సత్యదుర్గాప్రసాద్‌రెడ్డి రూ.17.10 లక్షలకు, జంగమవాని చెరువును రూ.21 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. నాల్గవ వంతు నగదు మొత్తాన్ని అధికారులకు చెల్లించారు. వేలందారులు సిండికేట్‌గా వ్యవహరించి గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండికొట్టినట్లుగా గ్రామస్తులు వాపోతున్నారు. వేలంలో గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, డెప్యూటీ ఎంపీడీఓ ఎండీవీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్‌బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ర్యాంప్ పథకం కింద 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించనున్నట్లు బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో టి.త్రినాథరావు తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా పరిశ్రమల సంస్థ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగాన్ని బలోపేతం చేయటం, కీలకమైన సవాళ్లను పరిష్కరించటం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించటం ద్వారా ఆర్థిక పునరుద్ధరణను సులభతరం చేసేందుకు ర్యాంప్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ పథకం కింద ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేకంగా 'ఉద్యమ్' రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల సంస్థ అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని ఆసక్తి కలిగిన ఎంఎస్‌ఎంఈ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని త్రినాథరావు కోరారు.

రైతులపై పాలకుల నిర్లక్ష్యం సరికాదు



కంకిపాడు: రైతులపై కేంద్ర, రాష్ట్ర పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించట సరికాదని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు విమర్శించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కంకిపాడులోని అగ్రి ల్యాబ్ వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. డెల్టాలో వరి ఇప్పటికే చిరుపొట్ట దశకు చేరిందన్నారు. యూరియా, కాంప్లెక్సు ఎరువులు సమృద్ధిగా అందించకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు.

వినతి పత్రం అందజేత..

రైతులు ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకుండా అలసత్వం ప్రదర్శించటం దారుణమన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్కేలలో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి ఉషారాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జె.రవి, వి.మరియదాసు, పి.దుర్గారావు, వి.శివశంకర్, లాం ఆశీర్వాదం, పి.ప్రసాద్, పి.సాంబశివరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా

- ఘనంగా వినాయకచవితి వేడుకలు
- వాడవాడలా విశేష పూజలు

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజక వర్గాల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. వాడవాడలా వినాయక చవితి వేడుకలను వివిధ సంఘాలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిపారు. వివిధ స్వరూపాల్లో విభిన్న ఆకృతుల్లో గణపయ్య విగ్రహాలను నెలకొల్పి దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా అంటూ పూజలు చేశారు. చవితి వేడుకలతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రత్యేక పూజ కార్యక్రమాలు..

మండల పరిధిలో 250 వినాయకుడి పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆయా పందిళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. పోరంకి గ్రామ దేవత గంగానమ్మ తల్లి గుడి వద్ద శివసతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కానూరు, యనమలకుదురు, పెనమలూరు ప్రాంతాల్లో ఎద్దఎత్తున వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

చోడవరంలో వివాదం..

చోడవరం రజక రాయాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వివాదంలో నెలకొంది. బుధవారం వినాయకుడి నిమజ్జనం సందర్భంగా డీజే ఏర్పాటు చేసి ఊరేగిస్తుండగా గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి డీజే తొలగించాలని ఆదేశించారు. దీనికి నిర్వాహకులు అభ్యంతరం తెలిపి పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

పందిళ్లకు రాజకీయ రంగు

గ్రామాల్లో వినాయక పందిళ్లకు రాజకీయ వివాదం చుట్టుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ నేతలు పందిళ్ల వద్ద తమపేరే ఉంచాలని పట్టుపట్టారు. వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన పందిళ్లకు అనుమతులు లేవని బెదిరించారు. కానూరులో ఈ ఘటన జరగటంతో భక్తులు టీడీపీ నేతల వైఖరి పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



కంకిపాడులో పూజలు చేస్తున్న భక్తులు



దావాజిగూడెం రామాలయంలో గణనాథుడు

వైభవంగా గణేష్ నవరాత్రులు

కంకిపాడు: గణేష్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య నేతృత్వంలో కంకిపాడు ప్రధాన సెంటర్, రైతు బజారు ప్రాంతాల్లో భక్తులకు వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. మద్దూరు గంగానమ్మ గుడి సెంటరులో కొలువుదీరిన విఘ్నేశ్వరుడి ఊరేగింపు మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కంకిపాడు పట్టణంలోని చిట్టూరి భద్రాచలం వీధిలో గరుత్మండు సమేతంగా కొలువైన భారీ విఘ్నవినాయకుడి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీ వినాయకుడికి భక్తులు భక్తితో పూజలు జరిపించారు.

రామలింగేశ్వర ఆలయంలో పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి ఆలయంలో వినాయకుడి ఉత్సవాలు బుధవారం ఘనంగా చేశారు. ఆలయంలో వినాయకస్వామికి ఉదయం 8 గంటలకు అభిషేకం, అర్చన చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు..ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు దంపతులు పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



చవితి ఉత్సవాలు ప్రారంభం

విజయవాడరూరల్: చినకంచిలో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని విశేషంగా అలంకారం చేసి భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ మాట్లాడుతూ ఆదివారం గణపతి హోమం అనంతరం లక్ష గరికపూజ జరుగుతుందన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. శివాలయంలో వరసిద్ధి ఏకాంబరనాథస్వామిలో ఉన్న కార్యసిద్ధి వినాయకుని వేద విద్యార్థులచే నిర్వహిస్తామని చెప్పారు. నున్న గ్రామంలో తూర్పు రామాలయం సెంటర్‌లో, కోటకట్ట సెంటర్‌లో, లోయబాట రోడ్డు, లైబ్రరీ సెంటర్, హైస్కూల్ సెంటర్‌లో, శాలివాహన బజారు, చెరువు సెంటర్ పేరంటాలమ్మ గుడి సెంటర్‌లో చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాతపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, సీతారామపురంలో వాకాడవారి వీధి, మంగళాపురంలో కోదండ రామాలయం వద్ద, అప్పారావుపేట గ్రామంలో రాములవారి గుడి వద్ద వినాయకుని విగ్రహాలు పెట్టి పూజలు చేశారు. పి.నైనవరం గ్రామంలో రామాలయం సెంటర్, నాగేంద్రస్వామి దేవస్థానం, సుందరయ్యనగర్ కాలనీ, బీసీ కాలనీలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులు పూజలు చేశారు. అంబాపురం గ్రామంలో పాముల కాల్వ వద్ద, బోసుబొమ్మ సెంటర్లలో వినాయక విగ్రహాలు నెలకొల్పి, పూజలు చేశారు.

గణపతి ఉత్సవాలు..

గన్నవరం: దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రులను కలశస్థాపన, అఖండ దీపారాధనతో ప్రారంభించారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు. గన్నవరంలోని రాయ్‌నగర్, గౌడపేట, యాదవులపేట, సగర్లపేట, బుద్దవరం రోడ్డు, కేసరపల్లి, మర్లపాలెం, అల్లాపురం, బుద్దవరం, వీఎస్.పురం కాలనీల్లో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.



కంకిపాడులో ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య



వినాయకుడిని నిమజ్జనానికి తీసుకు వెళ్తున్న చిన్నారులు



కానూరు మురళీనగర్‌లో పూజలు చేస్తున్న ఎస్‌ఆర్ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ వాసులు



మద్దూరులో వినాయకుడి ఊరేగింపు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు



పోరంకి గంగానమ్మ ఆలయంలో వినాయకుడు



చినకంచిలో వినాయకస్వామి



కంకిపాడు చిట్టూరి భద్రాచలం రోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళి

గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. బషీర్‌బాగ్‌లో 2000 ఆగస్టు 28న విద్యుత్ ఉద్యమంలో పోలీస్ కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు వామపక్ష నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ...రాష్ట్రంలో రెండు కోట్ల విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ప్రభుత్వంతో అదానీ సంస్థ ఒప్పందం చేసుకుందన్నారు. దీనిలో భాగంగా చాప కింద నీరుల స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికే విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు కూడా ఏర్పాటు చేస్తే విద్యుత్ భారాలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వామపక్ష నాయకులు కాట్రగడ్డ రామచ్రందజోష, అనుమోలు వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, పఠన్ సర్దార్, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ముక్కలు చేసిన టీడీపీ

పెనమలూరు: రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసిన ఘనత చంద్రబాబునాయుడికే దక్కిందని సీపీఎం మండల కార్యదర్శి షేక్.కాశిం అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులపై చంద్రబాబు కాల్పులు జరిపించి ముగ్గురిని పొట్టన పెట్టుకోని, నేటికి 25 ఏళ్లు అయినందున మండల వ్యాప్తంగా సంస్మరణ దినోత్సవం చేశారు. ఈ సందర్భంగా కాశిం మాట్లాడుతూ చంద్రబాబు వైఖరిలో నేటికి మార్పు రాలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. స్మార్ట్ మీటర్లు అంటగడుతూ ప్రజలన నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. యనమలకుదురు, వణుకూరులో నిరసన దినం జరిపారు. కార్యక్రమంలో నాయకులు పాతాళలక్ష్మి, శాస్త్రి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.



గన్నవరంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు



పోరంకిలో నిరసన తెలుతున్న సీపీఎం నాయకులు

విద్యుత్ అమరవీరులకు నివాళులు

కంకిపాడు: విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు పిలుపునిచ్చారు. విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కంకిపాడులోని మండేపూడి భవన్‌లో గురువారం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలపై మోయలేని భారాలు మోపారని గుర్తుచేశారు. ఈభారాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో పలువురు అశువులు బాసారన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో విద్యుత్ భారాలను మోపుతున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి సాగిస్తున్న పాలనపై ప్రజలు తిరుగుబాటు చేయాలని కోరారు. విద్యుత్ భారాలు ఉపసంహరించుకునే వరకూ ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నేత పోతురాజు నాగేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.కుమారి, వి.శివశంకర్, వి.జాన్‌మోజెస్, పి.దుర్గారావు, ఎం.చంటి, వి.రమేష్, జె.రవి, కె.నాంచారయ్య, పీతా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటం ద్వారా మరింత విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రజలపై మోపేందుకు తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తుందని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ ఆరోపించారు. బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన అమరవీరుల సంస్మరణ దినాన్ని బాపులపాడు మండలం బండారుగూడెంలో గురువారం నిర్వహించారు. తొలుత కామ్రేడ్లు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ పోరాటం సాగిస్తామని చెప్పారు.

క్వాంటమ్ హ్యాకథాన్‌తో ఉజ్వల భవిష్యత్



పెనమలూరు: క్వాంటం హ్యాకథాన్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు క్యాంపస్‌లో గురువారం అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీ భవిష్యత్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ రూపకల్పనలో చాలా ముఖ్యమన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జట్లకు శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రో.ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, డీన్ డాక్టర్ డి.వెంకట్రావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి.రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉధృతంగా ఏటిపాయ



మద్దూరులో కరకట్ట వైపు చొచ్చుకు వస్తున్న వరదనీరు

కంకిపాడు: ఏటిపాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులు క్రితం వరకూ శాంతించిన కృష్ణమ్మ మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ఏటిపాయ నిండుకుండలా మారింది. ప్రకాశం బ్యారేజీ నుంచి 4.68 లక్షలు క్యూసెక్కుల వరదనీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో కృష్ణానది ఏటిపాయ వరదనీటితో పొంగి పొర్లుతోంది. సముద్రం వైపు వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాలతో పాటుగా పెనమలూరు మండలంలోని పెద పులిపాక, చోడవరం పరిసరాల గుండా ఏటిపాయ వరదనీటితో నిండుగా ప్రవహిస్తోంది.

కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ వరదనీరు చేరటంతో సగానికి పైగా ఆలయం ముంపునకు గురైంది. మద్దూరు వద్ద ఏటిపాయ అంచులు దాటి కరకట్ట వైపు చొచ్చుకు వస్తోంది. రెండు రోజులు క్రితం వరకూ వరదనీటి ఉధృతి తగ్గటంతో ఏటిపాయలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏటిపాయలోని లంక భూముల్లో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు, కూలీలు సన్నాహాలు చేసుకున్నారు. ఇంతలో మళ్లీ వరద వచ్చి చేరింది. దీంతో ఏటిపాయలోకి వెళ్లే రహదారి మార్గం మళ్లీ నీట మునిగింది. ఫలితంగా ఏటిపాయలోకి రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు, కూలీలు పడవలను ఆశ్రయిస్తున్నారు. అయితే వరద ఉధృతి పెరుగుతుండటంతో రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటిపాయ ఒడ్డున బందోబస్తు చర్యలు చేపట్టారు. బుధవారం నాటి వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.



చెరువును తలపిస్తున్న కంకిపాడు బస్టాండ్

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



రామవరప్పాడు: సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ముఖ్య అతిథి డాక్టర్ పి. సాయి కిరణ్ అన్నారు. ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ అనేది సాంప్రదాయ కంప్యూటింగ్ కంటే భిన్నంగా, క్వాంటమ్ బిట్స్ ఆధారంగా పనిచేసే విప్లవాత్మక సాంకేతికత అన్నారు. ఇది ప్రత్యేకమైన గణనశక్తితో క్లిష్టమైన గణన సమస్యలను వేగంగా పరిష్కరిస్తుందని తెలిపారు. యువత ప్రతిభకు ఇటువంటి అవకాశాలు కల్పించడం ద్వారా మన దేశం గ్లోబల్ టెక్ వేదికపై ముందంజలో ఉంటుందని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ హ్యాకథాన్‌ను ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. హ్యాకథాన్‌లో మొత్తం 12 విద్యార్థి టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో ఐదు జట్లు తరువాత స్టేజీకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ కె.రమేష్, కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, ఎస్‌పీవోసీ డాక్టర్ రాధికా, జ్యూరీలు డాక్టర్ ఎస్.శ్రీగౌరి, అశోక్, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

గణపతి ఆశ్రమంలో భగవద్గీత పారాయణం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని గురుపాదుక మందిరంలో గురువారం భగవద్గీత పారాయణం నిర్వహించారు. తొలుత శ్రీగురుదత్తాత్రేయ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం విజయవాడ, గన్నవరం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులచే భగవద్గీత పారాయణం, శ్రీలలిత సహస్రనామ పారాయణం జరిపారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.